క్లుప్తంగా

స్వామివారికి పంచామృతాభిషేకాలు



ఎస్.అన్నవరంలో వరాహస్వామికి అభిషేకాలు, పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి పుష్కరిణిలో కొలువైన శ్రీలక్ష్మీవరాహ స్వామి వారికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వరహస్వామి జయంతిని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవకలశాల్లో పంచామృతాలను స్వామివారికి అభిషేకించారు. సోమవారం ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు నక్షత్రం శ్రవణ సందర్భంగా శ్రీవారికి, పరివార దేవతలకు 108 కలశాల పంచామృతాలతో అభిషేకాలు చేయనున్నట్టు అర్చకులు తెలిపారు. అలాగే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా సూర్యదేవుని గ్రామోత్సవం



మల్లవరంలో సూర్యదేవుని విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని మల్లవరంలో ఆదివారం సూర్యదేవుని గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సనాతన ధర్మప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో ధార్మిక సభ్యులు గంధం నగేష్, పల్లెల పెంటయ్య, గోకాట చిట్టిబాబు, మహంతి సూరిబాబు, భీరక శ్రీను తదితరులు ఉషాపద్మినీ, ఛాయా సమేత సూర్యనారాయణస్వామి విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. గ్రామస్తులు విగ్రహాలకు హారతులు ఇచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా, సభ్యులు పిల్లంగోరు పాపారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం




జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: గ్రామంలోని శెట్టిబలిజ కాలనీ శివారు పంట పొలాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5200, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై రఘునాథరావు తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో పేకాట, కోడి పందేలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా వేంకటేశ్వరుని పవిత్రోత్సవాలు



స్వామివారి పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: తిరుమల తిరుపతి దేవస్థానాల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు పిఠాపురంలో ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజ, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్ పాల్గొన్నారు.

రోగులు ఫుల్.. సేవలు డల్

- 30 పడకల ఆస్పత్రికి నలుగురే డాక్టర్లు
- నిత్యం 400కు పైబడి ఓపీ
- వార్డుల్లో 50 మంది ఇన్‌పేషెంట్లు
- డాక్టర్లను నియమించాలని కోరుతున్న రోగులు



గోకవరంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి

గోకవరం: ఏజెన్సీ ముఖద్వారమైన గోకవరంలో ప్రభుత్వాస్పత్రిని వైద్యుల కొరత వేధిస్తోంది. 30 పడకల ఆస్పత్రికి కేవలం నలుగురు డాక్టర్లు మాత్రమే ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు మౌలిక వసతుల లేమితో ఇటు వైద్య సిబ్బంది, అటు రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గోకవరంలో పాత ప్రభుత్వాస్పత్రి స్థానంలో గతేడాది డిసెంబర్ నెలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.5.65 కోట్లతో పూర్తి అధునాతన భవనాన్ని ప్రారంభించారు. పదేళ్ల క్రితం వరకు పది పడకల ఆసుపత్రిగా ఉన్న ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను అప్‌గ్రేడ్ చేసి 30 పడకల స్థాయికి పెంచారు. 30 పడకల ఆస్పత్రికి తొమ్మిది మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఐదుగురు వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడంతో నలుగురు మాత్రమే సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో 200 ఓపీ ఉండగా నూతన భవనం అందుబాటులోకి వచ్చిన తరువాత 400కు పెరిగింది. అలాగే వార్డుల్లో 50 మంది ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలడంతో రోగులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. రోగులకు తగ్గట్టుగా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైద్యులు, సిబ్బందికి పనిభారం పెరగడంతో పాటు రోగులు వైద్యం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.



కుర్చీలు లేకపోవడంతో పేషెంట్ల బెడ్‌లపై వేచి ఉన్న రోగులు



ఆసుపత్రిలో స్టాండ్ లేకపోవడంతో కిటికీకి వేలాడదీసి పెట్టిన సెలైన్

వసతుల లేమితో ఇక్కట్లు

నూతన భవనం అందుబాటులోకి వచ్చినప్పటికీ అందుకు అనుగుణంగా మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోగులు వేచి ఉండేందుకు కుర్చీలు లేకపోవడంతో నిలబడి, బెడ్లపై వేచి ఉండాల్సి వస్తోంది. అలాగే సెలైన్ పెట్టడానికి స్టాండ్లు లేకపోవడంతో కిటికీలకు కట్టి వైద్యం అందిస్తున్నారు.

50 పడకల ఆస్పత్రిగా మార్చితే ప్రయోజనకరం

గోకవరం ప్రభుత్వాస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. నూతన భవనం అందుబాటులోకి వచ్చాక ఇన్‌పేషెంట్లు పెరిగారు. కానీ 30 పడకల ఆస్పత్రి కావడంతో 9 మంది డాక్టర్లు మాత్రమే ఉండాల్సి ఉంది. దీంతో రాత్రి సమయంలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు మాత్రమే డ్యూటీలో ఉంటున్నారు. కాగా రాత్రి సమయంలో ఇన్‌పేషెంట్లు 50 మంది వరకు ఉండటంతో సిబ్బందిపై పని భారం పెరిగి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే డాక్టర్ల సంఖ్య 15కు పెరిగే అవకాశం ఉంది. అలాగే 12 మంది స్టాఫ్ నర్సులు, 40 నుంచి 50 అదనపు సిబ్బంది వస్తారు. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయి. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి గోకవరం ప్రభుత్వాస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



గోకవరం సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం జనరల్ ఫిజీషియన్, సర్జన్, గైనిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వారానికి ఒకసారి ఆర్థో సేవలు అందుతున్నాయి. ప్రతి రోజూ 400 వరకూ ఓపీ ఉంటోంది. డాక్టర్ల కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. సెలైన్ పెట్టడానికి స్టాండ్లు కొనుగోలు చేస్తున్నాం. ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం 30 కుర్చీలు అవసరం అవుతాయి. దాతల సహకారంతో సమకూర్చే ఆలోచనలో ఉన్నాం. – **డాక్టర్ వనజాకుమారి,** సూపరింటిండెంట్, సీహెచ్‌సీ, గోకవరం

రేపటి నుంచి పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ప్రత్తిపాడు: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 18 వరకూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ తెలిపారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తదితర లక్షణాలు కనిపిస్తే గాలికుంటు వ్యాధి సోకినట్టు రైతులు గుర్తించాలన్నారు. ఈ వ్యాధి వలన పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. పాలు తాగే దూడల్లో మరణాలు, సకాలంలో వైద్యం అందించకపోతే పశువులు చనిపోవడం జరుగుతుందన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పశువుల గుర్తింపునకు చెవిపోగు వేయటం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు.

బాడీబిల్డింగ్‌పై ఆసక్తి పెరగాలి

తుని రూరల్: శరీరాకృతి, బాడీ బిల్డింగ్‌పై గ్రామీణుల్లో ఆసక్తి పెరగాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గ్రామీణ యువత రాణించాలని ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సోము నాయుడు అన్నారు. మండలంలోని డి.పోలవరంలో బత్తిన శివ, బత్తిన నాగేంద్ర ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. గ్రామీణులకు అందుబాటులోకి వచ్చిన జిమ్ సెంటర్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీబీబీఏ వ్యవస్థాపకులు కె.గురునాథరావు, వైస్ ప్రెసిడెంట్ జె.కిరణ్ పాల్గొన్నారు.

నాటి నుంచి నేటి వరకూ కెమెరాలు భద్రం



పూర్వం నుంచి నేటి తరం వరకూ కెమెరాలతో ఛాయాచిత్ర అవార్డు గ్రహీత కృష్ణ

ప్రత్తిపాడు: తెల్లారింది మొదలు రాత్రయ్యేదాకా వడివడిగా ప్రపంచం మారిపోతోంది. ఆగమనంలో ప్రకృతిలో ఏర్పడే దృశ్యాలు క్షణికం. మనసును దోచే సహజ దృశ్యాలు అనేకం. వీటిని సజీవ సాక్ష్యాలుగా నిలిపేదే ఫొటోగ్రఫీ. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 160 సంవత్సరాల చరిత్ర గల ఫొటోగ్రఫీ గురించి మనం ఒక్కసారి మననం చేసుకుంటే.... ముసుగు వేసి ఫొటో తీసే ఫీల్డ్ కెమెరాల స్థానంలో నేడు జేబులో ఇమిడే కెమెరాలు, సెల్‌ఫోన్ కెమెరాలు, స్పై కెమెరాలు వంటి వివిధ రకాల కెమెరాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఒకప్పుడు మానవ రూపానికి ప్రతిరూపం సృష్టించడం ఒక చిత్రకారునికే సాధ్యమయ్యేది. ప్రస్తుతం చిన్న పిల్లలు సైతం ఫొటోగ్రాఫర్ అవసరం లేకుండానే ఎలాంటి ఫొటోనైనా తన కెమెరా, సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. డిజిటల్ ఫొటోగ్రఫీ రావడంతో ఫొటోగ్రఫీలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. అనాటి ముసుగు వేసి తీసే కెమెరాల నుంచి నేటి తరం వరకు ఉన్న కెమెరాలు ప్రత్తిపాడుకు చెందిన అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత, ఈశ్వరా స్టూడియో అధినేత సలాది కృష్ణ వద్ద భద్రంగా ఉన్నాయి.

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెంలో సారా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సారా తయారీకి సిద్ధం చేసిన 2000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై యువి శివ నాగ బాబు తెలిపారు.

ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం విజయవంతం



సర్టిఫికేషన్‌పై ఆన్‌లైన్ క్లాసు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 13 రోజుల పాటు నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం విజయవంతమైనట్టు యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదిత్య లెర్నింగ్ అకాడమీ (అలా), ఐ డ్యూ విభూ సంయుక్త ఆధ్వర్యంలో మెషీన్ లెర్నింగ్, జనరేటీవ్ కృత్రిమ మేధస్సు అనే అత్యాధునిక అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్‌పై కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న యంత్ర అభ్యాసం, కృత్రిమ మేధస్సు రంగంలో ఉపయోగాలు, మెళకువలు వివరించినట్టు తెలిపారు. ఈ ప్రోగ్రాంకి ఆర్.సునీత రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సరేష్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

గండేపల్లి: దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. మండలంలోని సూరంపాలెంలో ఈ నెల 15న రెండువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. సెక్షన్ల తీవ్రత ఆధారంగా దర్యాప్తు జరుగుతుందని, ఈ నేపథ్యంలో ఎవరైన ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేద సంరక్షణతో సమాజానికి మేలు



వేద స్వస్తి నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: సమాజంలో ప్రతిఒక్కరూ క్షేమంగా జీవనం సాగించడానికి వేదాల సంరక్షణ ఎంతో అవసరమని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణ మూర్తి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో వేద స్వస్తిని స్థానిక వెంకట్‌నగర్‌లోని శివాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజానికి ఎనలేని సేవలందిస్తున్న ఎస్‌బీఐ సీనియర్ విశ్రాంత అధికారి చీమలకొండ కృష్ణమూర్తిను ఘనంగా సత్కరించారు. అనంతరం పసుమర్తి మాట్లాడుతూ వేద వాఙ్మయ సంరక్షణకే బ్రాహ్మణులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడంలో శ్రద్ధ కనబరచకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. వేద స్వస్తి సందర్భంగా పండితులు వల్లిస్తున్న వేద ఘోష ద్వారా ఆ ప్రాంతమంతా పరిమళించే విధంగా మారుతుందన్నారు. పరిసర ప్రాంతాలకు శుభాన్ని చేకూరుతుందన్నారు. సన్మాన గ్రహీత కృష్ణమూర్తి మాట్లాడుతూ సేవా సంఘం ఏర్పాటు చేయడమే కాక, అన్ని బ్రాహ్మణ సంఘాలను పరస్పర స్నేహభావంతో కలుపుకొని ముందుకుసాగాలన్న ఆలోచనను అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణశర్మ, తనికెళ్ల వెంకటరామయ్యశర్మ, ముఖ్య సలహాదారులు నాగ మహాశయా, ఎల్లాప్రగడ పద్మనాభ స్వామి, ఉపాధ్యక్షులు కడియాల సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి పొద్దుటూరి బాలాజీ విశ్వనాథ్, ఉప కార్యదర్శి మర్ల జగన్నాథ్ శర్మ, కోశాధికారి కప్పగంతు సాయిరాం శర్మ పాల్గొన్నారు.

ముగిసిన మరిడమ్మ జాతర

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఏటా శ్రావణ మాసం ఆరంభంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా ఆదివారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్న సమారాధనను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. తొలుత ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలో వేలాదిగా భక్తులు హాజరై, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తూతిక రాజు, రంధి సత్యనారాయణ, కొరుపూరి రాజు, ఆరిఫ్ ఆలీ, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు



ఏలేశ్వరంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నేత వెంకట్రావు

ఏలేశ్వరం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో స్థానిక షిర్డీ నగర్‌లో నేతాజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ కీలకపాత్ర పోషించారన్నారు. ఆజాద్ హిందూఫౌజ్‌ను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటంలో తన సైన్యాన్ని వినియోగించారన్నారు. విద్యార్థులు దేశనాయకుల జీవిత చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. నేటి యువత నేతాజీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పోతాబత్తుల పెదబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్, పలివెల మల్లేశ్వరరావు, అనిల్‌కుమార్, సిరిపరపు బాబీ తదితరులు పాల్గొన్నారు.

గొయ్యి తవ్వారు... పూడ్చడం మరిచారు

కిర్లంపూడి: చిల్లంగి నుంచి గెద్దనాపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి చెంతనే పెద్ద రంధ్రం ఏర్పడడంతో ఆ దారిని పోయే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మెరక పొలాల నుంచి వచ్చే నీరు పోయేందుకు రోడ్డు కింద ఏర్పాటు చేసిన తూర మట్టితో కూరుకుపోవడంతో అధికారులు పొక్లెయిన్ సహాయంతో గొయ్యి తవ్వారు. దానిని పూడ్చకుండా అలానే వదిలేయడంతో పెద్ద రంధ్రంగా మారింది. దీంతో అదుపు తప్పి ఎక్కడ గోతిలో పడిపోతామో అని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. మెరక పొలాల్లో ఉన్న నీరు పోయేందుకు శాశ్వత తూమును ఏర్పాటు చేయాలని రైతులు ఎంపీపీ తోట రవిని కోరారు.



చిల్లంగి నుంచి గెద్దనాపల్లికి వెళ్లే రహదారికి చెంతనే తవ్వి వదిలేసిన గొయ్యి

బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



తునిలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

తుని: కోల్‌కతాలో అత్యాచారం, హత్యకు గురైన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తుని–పాయకరావుపేట శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రఘునాథరావు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా ఐఎంఏ తుని-పాయకరావుపేట వైద్యులు, వైద్య సిబ్బంది తుని పట్టణంలో ఆదివారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రఘునాథరావు మాట్లాడుతూ వైద్యురాలి పట్ల అమానుషంగా ప్రవర్తించి ఆమె ప్రాణాలను బలిగొన్న వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. రాష్ట్రంలో వైద్యుల రక్షణ చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆయకట్టుకు 600 క్యూసెక్కుల విడుదల



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టు నుంచి దిగువ ఆయకట్టుకు నీటి విడుదలను పెంచారు. ఖరీఫ్ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను పెంచినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయకట్టుకు 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. గత కొన్నిరోజులుగా ఎగువ ప్రాంతంలో వర్షాలు పడుతుండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా పెరిగాయి. ఎగువ ప్రాంతం నుంచి 1100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 82.53 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 16.66 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. విశాఖకు 300, స్పిల్‌వే ద్వారా 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారు

సామర్లకోట: శ్రావణ మాసం ఆదివారం కావడంతో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈఓ భళ్ల నీలకంఠం భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామి వారి ప్రసాద వితరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకె రాజ్ గోపాల్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రక్షాబంధన్‌కు రెడీ !

- నేడు రాఖీపౌర్ణమి
- రాఖీలు కొనేందుకు క్యూ కట్టిన సోదరీమణులు
- దుకాణాల వద్ద రద్దీ

ఏలేశ్వరం: అన్నాచెల్లెల అనుబంధం జన్మజన్మల సంబంధం... జాబిలమ్మకిది జన్మదినం కోటితారకల కోలాహలం..అన్నయ్యదిద్దిన వర్ణాలన్నీ అరచేతిలో హరివిల్లులై అంటూ అన్నలపై చెల్లెళ్లకు ఉండే ప్రేమాభిమాలను ఓ సినీగేయ కవి వర్ణించారు. పుట్టిన నాటి నుంచి తనువు చాలించే వరకు అన్నలపై చెల్లెలకు ఉండే ప్రేమ అపూర్వమైనదని అనేక సంఘటనలు రుజువు చేశాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీపౌర్ణమి (రక్షాబంధన్) నిలుస్తుంది. ఏటా రాఖీ పౌర్ణమికి అక్కాచెల్లెళ్లు తమకు తోచిన విధంగా రాఖీలు కొనుగోలు చేసి స్వీట్లు తినిపిస్తూ సోదరులకు కడతారు. సోదరులు తమకు ఉన్నంతలో ఆడపడుచులకు బహుమతులు అందజేస్తారు. కాగా సోమవారం రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని పలు దుకాణాల వద్ద వీటిని కొగుగోలు చేసేందుకు మహిళలు క్యూ కట్టారు. దీంతో ఆదివారం దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకూ రాఖీ అమ్మకాలు జోరుగా సాగాయి.



ఏలేశ్వరంలో ఆకట్టుకుంటున్న రాఖీలు

ఆకట్టుకున్న రాఖీలు

మారుతున్న కాలానికి అనుగుణంగా రాఖీల తయారీలో మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు ఒకటి రెండు రకాలు మినహా పెద్దగా రాఖీలు తయారుచేసేవారు కాదు. ప్రస్తుతం రాఖీల తయారీలో పెను మార్పులు వచ్చాయి. ఒక్కొక్క రాఖీ రూ.5 నుంచి రూ.200 వరకూ విక్రయిస్తున్నారు. గతంలో పేపర్లతో తయారు చేసే రాఖీల స్థానంలో నేడు రకరకాల పాడులతో రాఖీలు అమ్ముతున్నారు. రాఖీలు ఆకారాలతో పాటు ధరల్లో మార్పులు వచ్చాయి. సెంటిమెంట్ పండగ కావడంతో ధరలను లెక్కచేయక సోదరీమణులు రాఖీలను కొనుగోలు చేస్తున్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ఏలేశ్వరం: పట్టణంలో రక్షాబంధన్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక లింగంపర్తిరోడ్‌లో రాజమహేంద్రవరం రాజయోగిని బీకే మీరా అక్కయ్య, స్థానిక విశ్వవిద్యాలయం రాజయోగి బీకే సుధా అక్కయ్య ఆధ్వర్యంలో రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్షాబంధన్ అంటే సోదరీమణులకు సోదరులు రక్షణ కల్పించడమని అర్థమన్నారు. రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అన్నారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామిలకు అక్కయ్యలు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో తిరుమల సత్యనారాయణ, కొప్పన శ్రీరామ్, తమ్మా గోపాలరావు, పరవాడ రమేష్, శంకాని బాబ్జీ, సామంతుల రాంబాబు, కోరాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఏలేశ్వరంలో రాఖీలు కడుతున్న అక్కయ్యలు